క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డు గదిని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవర్ధనరెడ్డి

కురిచేడు: మండలంలో జరుగుతున్న పలు కార్యక్రమాలను కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఫ్రీహోల్డ్ ఆఫ్ అసైన్‌మెంట్ కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయన్నారు. పేరంబొట్లపాలెంలో ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని రికార్డు గదిని తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రజనికుమారి, సిబ్బంది ఉన్నారు.

ఇంటికి చేరే వరకూ ఉగ్గబట్టాల్సిందే!

- మరుగుదొడ్లు లేక మహిళల ఇక్కట్లు
- అత్యవసర పరిస్థితుల్లో ఆర్టీసీ బస్టాండే దిక్కు



నిరుపయోగంగా ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మరుగుదొడ్లు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు నిత్యం మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. ప్రస్తుతం దసరా పర్వదినం కావడంతో శుభకార్యానికి అవసరమైన కొత్త వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ఎక్కువ శాతం మంది మహిళలు మండల కేంద్రానికి వస్తుంటారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లు, వ్యాపార సముదాయాలు మహిళలతో రద్దీగా మారుతున్నాయి. ఈ క్రమంలో మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలపై వచ్చే వారైతే ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరికొందరు అత్యవసర పరిస్థితుల్లో చేసేదేమీ లేక షాపింగ్‌లకు ఫుల్‌స్టాప్ పెట్టి గమ్యస్థానానికి చేరే వరకూ ఉగ్గపట్టుకుని ఇబ్బందులు పడుతున్నారు.

యాత్రికులకు సైతం కష్టాలు

అనునిత్యం సరుకులు, దుస్తులు, వైద్య అవసరాలతో పాటు వ్యక్తిగత పనుల కోసం ఎంతో మంది మహిళలు మండల కేంద్రానికి తరలి వస్తుంటారు. దీంతో పాటు పాటు శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే ఎంతో మంది యాత్రికులు సైతం మండల కేంద్రం నుంచి వెళ్తుంటారు. ఈ క్రమంలో మహిళలకు అందుబాటులో మరుగుదొడ్లు లేకపోవటంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మాత్రమే ఒకే ఒక్కచోట మరుగుదొడ్లు ఉండగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గతంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు కొద్ది రోజులుగా నిరుపయోగంగా మారాయి. దీంతో మండల కేంద్రంలోని పలుచోట్లకు పనులపై వచ్చిన మహిళలు పనులు పూర్తయ్యే వరకూ అలాగే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారటంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల నుంచి మురుగునీరు బయటకు రావటం .. చుట్టు పక్కల వ్యాపారులు చెత్తా చెదారం పడేయడంతో అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. దాన్ని నిర్వహించే వ్యక్తి కూడా మరణించటంతో మరుగుదొడ్లను మూసేశారు. రానున్నది కార్తీకమాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు శ్రీశైలం రానున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో మరికొన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని



పెద్దారవీడు: టమోట పంట చుట్టూ ఉంచిన రంగుల చీరలు

పంటల రక్షణకు చీరలే ఆధారం

పెద్దారవీడు: ఆరుగాలం పండించిన పంటలు చేతికొచ్చే దశలో అన్నదాతలకు రాత్రి వేళల్లో అడవి పందులతో నష్టం వాటిల్లుతోంది. వాటి బారి నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కురిసిన వర్షాలకు పత్తి, మిరప, కంది, కూరగాయలు తదితర పంటలను సాగు చేశారు. మండలంలోని కలనూతల, గుండంచర్ల, పెద్దారవీడు, కంభంపాడు, రేగుమానిపల్లె, తంగిరాలపల్లె, సుంకేసుల, పుచ్చకాయలపల్లి తదితర గ్రామాలు చుట్టూ కొండల దగ్గరలో ఉన్నాయి. అడవి పందులు నోటి భాగం (మొట్టె)తో భూమిని లోతుగా తవ్వి వేళ్లను పెకిలించి పంటలకు నష్ట కలుగజేస్తాయి. పగలు కొండలు, పొదల చాటున ఉండి తెల్లవారు జామున, అర్ధరాత్రి వేళల్లో అడవి పందులు గుంపులు గుంపులుగా పెద్ద సంఖ్యలో పంటలపై దాడి చేస్తూ రైతులను నిద్రపోనివ్వడం లేదు. పంటలను కాపాడేందుకు పొలంలో మంచాలు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో మంటలు వేస్తూ టపాకాయలు కాలుస్తూ అడవి పందులు రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాత చీరలు కడితే పందులు రావని చెప్పడంతో కొందరు రైతులు పాత రంగు చీరలను ఒక్కొక్కటి రూ.15 కొనుగోలు చేసి సాగు చేసిన పంటకు నాలుగు దిక్కుల చుట్టూ కర్రలను ఏర్పాటు చేసుకుని రక్షణగా కట్టారు. ఇలా చేస్తే పొలాల వద్దకు పందులు రావడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో పాత చీరలకు మంచి డిమాండ్ పెరిగింది. స్థోమత ఉన్న రైతులు పొలం చుట్టూ ఇనుప తీగ, సోలార్‌తో కంచె ఏర్పాటు చేసుకుని పంటలను రక్షించుకుంటున్నారు. ఇటీవల మండలంలో ఎక్కడ చూసినా పొలాల్లో ఈ దృశ్యాలే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సోలార్ కంచెలను సబ్సిడీతో మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

సరస్వతీ మాతా..జయహో!



దర్శి: జ్ఞాన సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ తల్లి



దర్శి: జ్ఞాన సరస్వతీదేవిగా దద్దాలమ్మ అమ్మవారు



ముండ్లమూరు: మారెళ్లలో జ్ఞాన సరస్వతీదేవిగా..



పుల్లలచెరువు: శ్రీసరస్వతిదేవిగా అమ్మవారు



పెద్దారవీడు: రాజంపల్లిలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దదోర్నాల: ప్రకృతి స్వరూపిణి దుర్గాదేవి త్రిశక్తి స్వరూపిణిగా కీర్తించబడింది. త్రిశక్తి స్వరూపిణి అయిన సరస్వతీదేవి శుంభన శుంభులనే రాక్షసులను వధించింది. దీనికి ప్రతీకగా దుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజు అమ్మవారికి సరస్వతీ దేవి అలంకారం చేస్తారు. చింతామణి, సరస్వతి, నిలసరస్వతి, జ్ఞానసరస్వతి, ఘట సరస్వతి, కిణి సరస్వతి, అంతరిక్ష సరస్వతి, మహాసరస్వతి అనే 7 రూపాల్లో ఉంటుందని వేదపురాణాల్లో చెప్పబడింది. అందుకే ఇతర అలంకారాలకన్నా సరస్వతీ దేవి అలంకారానికి శరన్నవరాత్రుల్లో ప్రాధాన్యం ఏర్పడింది. మానవులకి సకల విద్యల్ని ప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి అయిన అమ్మవారు గురువారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మూల నక్షత్రం సందర్భంగా పలు దేవాలయాల్లో సామూహిక అక్షరభ్యాసాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని జ్ఞానాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని పలు దేవాలయాలు విద్యుద్దీపకాంతులీనుతున్నాయి. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ వాసవీ మాత అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు బి.రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా మండలంలో చట్లమిట్ల పంచాయతీ పరిధి రాజంపల్లె గ్రామం సమీపంలో వెలసిన శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు మహాసరస్వతి అలంకరణలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పుల్లలచెరువు: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల నక్షత్రం. దీంతో బాల బాలికలచే అమ్మవారికి కంకుమార్చన చేయించారు. ఈ సందర్భంగా భక్తులు విరివిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో 7వ రోజు జ్ఞాన సరస్వతిగా ఈశ్వరీదేవి దర్శనమిచ్చారు. భక్తులు గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వాముల వారికి కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామికి పూజలు చేశారు. పూజారి మణిశర్మ అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేసి హారతులిచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెదన్నపాలెం గ్రామానికి చెందిన శింగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సుబ్బమ్మ దంపతులు భక్తులకు అల్పాహారం అందజేశారు.

దర్శి: నియోజకవర్గంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో అమ్మవారిని జ్ఞాన సరస్వతీ దేవిగా అలంకరించారు. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు జ్ఞాన సరస్వతీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని వీణతో అందంగా అలంకరించారు. అమ్మవారికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకాలు చేశారు. కుంకుమ పూజా కార్యక్రమాలు చేసి పూల మాలలతో అమ్మవారి అలంకరణ అందరినీ ఆకర్షించింది. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. పట్టణంలోని దద్దాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు జ్ఞాన సరస్వతిదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు జ్ఞాన సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ తల్లి జ్ఞాన సరస్వతీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు.

తాళ్లూరు మండలంలో..

ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారు జ్ఞానసరస్వతీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని అందంగా పూల మాలలతో అలంకరించారు.

ముండ్లమూరు మండలంలో..

మారెళ్ల గ్రామంలో శ్రీ భ్రమరాంబికా దేవి మాతా సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ భ్రమరాంబికాదేవి శ్రీ జ్ఞాన సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు చేశారు. ఆయా ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు.

త్రిపురాంతకం: దసర శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీబాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో మూలా నక్షత్రం బుధవారం ప్రత్యేకంగా బాలపూజ, సరస్వతి పూజలు వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయంలో దసర శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రోజూ ఉభయదాతల పూజలు వేదపండితులు నిర్వహిస్తున్నారు. మూలా నక్షత్రం ప్రత్యేకంగా సరస్వతి పూజను నిర్వహించగా పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. అక్షరాభ్యాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు పలకలు, పుస్తకాలు, బలపాలు, పెన్నులు అందజేశారు. భారీగా తరలి వచ్చిన భక్తజనులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం వద్ద సందడి కనిపించింది. ప్రత్యేక పూజల



కురిచేడు: సరస్వతీదేవి అలంకరణలో శ్రీజ్ఞానప్రసూనాంబదేవి



త్రిపురాంతకం: సరస్వతి పూజకు హాజరైన భక్తులు, చిన్నారులు



శ్రీబాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఉభయదాతలు



దొనకొండ: పూజలు చేస్తున్న భక్తులు

అనంతరం అర్చకుడు ప్రసాదశర్మ ఆశీర్వచనం, ప్రసాదాలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు ఈఓ చెన్న కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆలయంలో ప్రముఖులు పూజలు

తిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయాన్ని ప్రముఖులు సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. గవర్నర్ ఏడీసీ రామాంజనేయులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కురిచేడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి, శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి దేవిలు చదువుల తల్లి సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు, అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరణ చేసి భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు సహస్రనామార్చనలు చేశారు. మూలానక్షత్రం కావడంతో అమ్మవారి జన్మనక్షత్రం కావటంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన



పెద్దారవీడు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి



దొనకొండ: గంగదేవిపల్లిలో..



పుల్లలచెరువు: చౌటపల్లిలో సూచనలిస్తున్న ఏఓ నిర్మలాదేవి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిలకచర్ల, వై.చర్లోపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కేవీవై, ఆర్ఓఎఫ్ఆర్, పథకంలో భాగంగా రైతు సేవా కేంద్రం పరిధిలో వ్యవసాయం, ఉద్యాన వన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్సీ శేషమ్మ మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు సాంకేతిక సమాచారంపై అవగాహన కలిగి వ్యవసాయం చేయటం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, ఈ–పంటల ప్రాముఖ్యతను మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ తెలియజేశారు.

పుల్లలచెరువు: పొలాలను సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని చౌటపల్లి, గారపెంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్చి, కంది పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. మిర్చి పంటలో తామర పురుగును గుర్తించామని, నివారణకు వేపగింజల కషాయం, జిగురు అట్టలను పొలాల్లో అమర్చాలని తెలిపారు. ఉద్యానవన సహాయకుడు కొండానాయక్ మాట్లాడుతూ పండ్ల తోటలను సాగు చేసుకునే రైతులకు 40 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తోందని, సాగు చేసే రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీఏఏ శివ నాయక్ మాట్లాడుతూ పశువుల షెడ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేస్తుందని, కావాల్సిన పశుపోషకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కురిచేడు: ప్రస్తుతం సాగులో ఉన్న కంది, పొగాకు, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని బోధనంపాడు, పేరంబొట్లపాలెం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కంది, పొగాకు, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు చేపట్టాలని తెలిపారు. బిందుసేద్యం, తుంపర సేద్యానికి ఇస్తున్న రాయితీల గురించి ఏపీఎంఐపీ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్యానవనశాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి, మిరప పంటలో గమనించిన పురుగులు, తెగుళ్ల నివారణ గురించి హెచ్ఈఓ బి.ధనలక్ష్మి వివరించారు. ఆయా గ్రామాల వీఏఏలు కె.అనూరాధ, మల్లికార్జున నాయక్, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: రైతులు మిత్ర పురుగులను సంరక్షించి శత్రు పురుగులను మాత్రమే నాశనం చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం గంగదేవిపల్లి, పెదన్నపాలెం, బాదాపురం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో కలిసి పత్తి, కంది పంటలను ఆయన సందర్శించారు. పత్తి పంటలో అల్లిక రెక్కల పురుగు గుడ్లను, తల్లి పురుగులను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, పేను బంక, తెల్లదోమ పురుగులను పరిశీలించారు. రైతులకు నివారణ సూచన, సలహాలు అందించారు. రైతులు పెట్టుబడి తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలన్నారు. విచ్చలవిడిగా పురుగు మందు పిచికారీ చేయాల్సిన అవసరం లేదని ఏఓ తెలిపారు. దర్శి మార్కెట్ యార్డు అధికారి వెంకటస్వామి, వ్యవసాయ సిబ్బంది అరుణదేవి, వీణాకుమారి, ప్రణీత, పశు వైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: దేవరాజుగట్టు, గొబ్బూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంలో కంది పంటను బుధవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి మాట్లాడుతూ కంది పండించే అన్ని ప్రాంతాల్లో కాయ ఈగ పురుగు ఎక్కువగా నష్టం కలగజేస్తుందని, నల్లగా మేరిసే తల్లిగా మాములుగా చిన్నదిగా ఉంటుందన్నారు. గింజ గట్టి పడే దశలో అంతర్వాహిక కీటక నాశనం చేస్తుందని, దీనికి నివారణకు మోనోక్రోటోపాస్ లేదా డైమితోయేట్ లేదా ప్రొఫెన్‌పాస్ మందులు వాడుతూ ఉండాలన్నారు. శనగలు, మినుములు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలో ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకుని డబ్బులు చెల్లించాలని సూచించారు. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ వేయని వారు ఉంటే వెంటనే వీఏఏల వద్ద వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్టు లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, వీఆర్వో విజయభాస్కరరెడ్డి, వీఏఏలు విజయలక్ష్మి, చిన్నా, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు (దర్శి): రైతులకు బ్యాంక్ సహకారం ఎంతో ఉపయోగ కరమని ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ మహేష్ అన్నారు. తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం గ్రామాల్లో ఏఓ ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మేనేజర్ మహేష్ మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలకు బ్యాంకుల పంట రుణాలు మంజూరు చేస్తాయన్నారు. వ్యవసాయం వృద్ధి కోసం, రైతుల శ్రేయస్సు కోసం బ్యాకుల సహకారం ఆర్థిక చేయూత అందిస్తుందని చెప్పారు. తీసుకున్న డబ్బు కాల పరిమితి లోపు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వ రాయితీలు కూడా వర్తిస్తాయని చెప్పారు. సుమారు 900 మంది రైతులకు 15 కోట్లకు పైగా పంట రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పశువుల రుణాలకు 60 పైసల వడ్డీ అని, నాలుగు ఎకరాలు ఉన్న రైతుకు తాకట్టు లేకుండా రూపాయి వడ్డీతో రూ.8 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామని చెప్పారు. రైతుల రుణం, లావాదేవీలు సక్రమంగా ఉంటే రుణ పరిమితి పెంచనున్నట్లు చెప్పారు. యార్డు అసిస్టెంట్ డి.శ్రీనివాసరావు, వీహెచ్ఏలు పి. మౌలా మస్తాన్‌ఖాన్, ఖాటం రాజు, వీఎఏలు డీవీ సుమ, అమృత వర్షిణి, రైతులు పాల్గొన్నారు.

దర్శి: రైతులందరూ వ్యవసాయ శాఖ సేవలు వినియోగించుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని కొత్తపల్లి, రాజంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. పంటలకు ఆశించిన తెగుళ్ల, చీడ పీడల నివారణకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. గ్రామ సర్పంచ్‌లు బట్టు రామారావు, వ్యవసాయ సహాయకులు పూసల శివసుధాకర్, షేక్ అబ్దుల్ సత్తార్, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ ఎయిర్‌పోర్ట్ పరిశీలన



ఈ-క్రాప్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ



మ్యాపును పరిశీలిస్తున్న ఆర్డీఓ

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలో బ్రిటీష్ కాలం నాటి విమానాశ్రయాన్ని కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధనరెడ్డి బుధవారం పరిశీలించారు. విమానాశ్రయానికి ఎన్ని ఎకరాలు భూమి ఉంది.. ప్రస్తుతం ఏమైనా అన్యాక్రాంతం అయిందా తదితర విషయాలను మ్యాపు ద్వారా పరిశీలించారు. గతంలో ఎప్పుడు నిర్మించారు, ఎందుకు నిర్మించారు, ఎన్ని ఎకరాలు తదితర విషయాలను సచివాలయం సర్వేయర్ ఎం.శ్రీనివాసులు ఆర్డీఓకు మ్యాపు ద్వారా వివరించారు. తాను నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టానని, అందుకోసం దొనకొండ ప్రాంతంలోని ప్రాముఖ్యత గల స్థలాలు, తదితర విషయాలను పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రుద్రసముద్రం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును ఆర్డీఓ పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో ఏర్పాటు చేశారు తదితర విషయాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ రైతుల పంట పొలాలను ఈ క్రాప్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మండలంలోని బాదాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన మిరప పంట ఈ–క్రాప్ నమోదును తనిఖీ చేశారు. తప్పు ఒప్పులు ఏమైనా ఉంటే వ్యవసాయశాఖ వారు సరి చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.రమాదేవి, రీసర్వే డీటీ నాగార్జునరెడ్డి, ఏఓ ఎస్.లక్ష్మీనారాయణ, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని తరిమి కొట్టాలి



చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: చేగువేరా స్ఫూర్తితో పోరాడి మతోన్మాదాన్ని తరిమి కొట్టి లౌకికత్వాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోడాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. చేగువేరా 57వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి డీవైఎఫ్ఐ నాయకులు ఉప్ప నారాయణ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ చేగువేరా ఒక ప్రాంతానికో, ఒక దేశానికో పరిమితమైన వ్యక్తి కాదన్నారు. యావత్ ప్రపంచానికి కొత్త శక్తిని ఇచ్చిన నేత అని కొనియాడారు. చేగువేరా స్ఫూర్తితో నేటి యువత పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆర్.జెస్సీపాల్, నాయకులు కంతా వెంకట్రావు, కళ్యాణ్, మాజీ డీవైఎఫ్ఐ నాయకులు సీహెచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే బూచేపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: పట్టణానికి చెందిన పేయింటర్ గర్నెపూడి ప్రసాద్ ప్రమాదవశాత్తు జారిపడి ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను మృతికి కారణాలు ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయంగా రూ.20 వేలు తమ నాయకులు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వైఎస్సార్ సీపీ నాయకులు గర్నెపూడి సామ్యేల్, కొడవటి అశోక్, ఎదురు నారాయణరెడ్డి, వెన్నపూస శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని 10వ వార్డులో ఇస్త్రీ చేసుకుని జీవనం సాగించే శ్రీనివాసులు తండ్రి వసంతపురం వెంకటేశ్వర్లు మృతి చెందారు. వార్డు ఇన్‌చార్జి చెరుకూరి జగన్ ద్వారా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి అన్నీ విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గౌతమి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దేవిడ్

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విజయ దశమి సందర్భంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కళాశాల అడ్మిన్ నానీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. టోర్నమెంట్‌ను దొనకొండ మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎస్.డేవిడ్ ప్రారంభించారు. మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని నానీ తెలిపారు. ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపక సిబ్బంది క్రీడల్లో పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు (దర్శి): సమగ్రశిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీల్లో వివిధ కేటగిరీల పోస్టుల భర్తీ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ గురజాల సుబ్బయ్య, ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండల విద్యాశాఖ కార్యాలయంలో మహిళా అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తాళ్లూరు మండలంలో టైప్–3 కేజీబీవీకి సంబంధించి డే అండ్ నైట్ వాచ్ ఉమన్–1, టైప్–4కి సంబంధించి చౌకీదార్–1, హెడ్ కుక్–1, అసిస్టెంట్ కుక్–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దర్శి: కేజీబీవీలకు సంబంధించిన బోధనేతర పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ కాకర్ల రఘురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025 విద్యా సంవత్సరంలో ఔట్ సోర్సింగ్ విధానంలో వీరిని నియమించనున్నట్లు తెలిపారు. మండల విద్యా శాఖకార్యాలయంలో మహిళా అభ్యర్థుల దరఖాస్తులు ఈ నెల 15వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలో అసిస్టెంట్ కుక్–2, నైట్ వాచ్ ఉమన్–1, స్కావెంజర్–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.